అడల్ట్స్ ఓన్లీ కథ A

# హనీమూన్

హోతా పద్మినీదేవి

''ఏమండీ!'' గోముగా పిలిచింది అభిజ్ఞ.

ఆకాశంలో పున్నమి చంద్రుడు. వెన్నెల పన్నీట అభ్యంగన స్నానం చేస్తున్న పుడమితల్లి. పెరట్లో, మల్లెపందిరి అవతలగా వేసిన మంచంమీద మెత్తని బూరుగుదూది పరుపుపై వేసిన పాల నురుగులాంటి దుప్పటి మీద పడుకుని మల్లెపందిరికి వున్న ఒకటి, అర పూలు విచ్చుకుని వాటి, సువాసనని గాలి తెమ్మెర మోసుకొస్తుంటే, కావ్యనాయికలాంటి అభిజ్ఞ చేతివేళ్ళు తన ఉంగరాల జుట్టుతో ఆటలాడుతుండగా, ఒకలాంటి తన్మయావస్థలో వున్న వేణు 'ఊ!' అన్నాడు.

పెళ్ళయిన తొలిరోజులు భర్త దగ్గర సంకోచం, మొహమాటం పూర్తిగా పోలేదామెకి. అసలు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికే కొత్తదంపతులు హనీమూన్‌కి వెళ్తారు. కానీ పెళ్ళయి పదిరోజులు దాటుతున్నా వేణు హనీమూన్ మాటే ఎత్తడు. తన పెళ్ళికి వారం రోజుల ముందు పెళ్ళయిన వైష్ణవి భర్తతో హనీమూన్‌కి వెళ్ళింది. తను మాత్రం ఈ పల్లెటూరిలో మగ్గిపోతోంది. వేణుని పెళ్ళి చేసుకోడంలో తొందరపడిందా?

''ఏమిటాలోచిస్తున్నావ్?'' తన మెడలోని గొలుసుతో చిక్కుపడిన ఆమె మెడలోని మంగళ సూత్రం గొలుసుని విడదీస్తూ అడిగాడు వేణు.

తన మనసులోని కోరికని బయట పెట్టడానికి ఇదే మంచి తరుణమనిపించింది అభిజ్ఞకి.

''మనం హనీమూన్‌కి వెళ్దామండీ!''

''హనీమూన్‌కా?'' వేణు సాలోచనగా చూసాడు.


''ఇదుగో హనీ ఇక్కడుంది'' అని ఆమె పెదవులని తాకాడు. ''మూన్ అక్కడున్నాడు మనకి తోడుగా..'' ఆకాశంలో నిండు జాబిలిని చూపిస్తూ అన్నాడు.

''అయినా నువ్వు నా పక్కనుంటే రోజూ హనీమూనే''

భర్తతో వాదించి తగవు పెట్టుకునైనా సరే హనీమూన్‌కి వెళ్ళడానికి అతన్ని ఒప్పించా లనుకుంది. కాని, తమ పెళ్ళయిన పది రోజులకే అతనితో గొడవపడ్డానికి ఏదో అడ్డు వస్తోంది. 'తన మనసులోని అసంతృప్తిని అతనికెలా తెలియచెయ్యడం? అతనంతట అతనుగా హనీమూన్‌కి తీసుకెళ్ళడానికి ఏం చెయ్యాలి?' అభిజ్ఞ తీవ్రంగా ఆలోచిస్తోంది.

★ ★ ★

అగ్రికల్చర్ ఎమ్మెస్సీ ప్యాసయి పల్లెటూరిలో వ్యవసాయం చేస్తున్న వేణు సిటీలో పెరిగిన అభిజ్ఞని ఇష్ట పడడంలో



వింత లేదు కాని, అభిజ్ఞ వేణుని ఇష్టపడడంలోనే వుంది వింత. తన బాబాయి కూతురు పెళ్ళిలో చూసిందామె వేణుని. బ్లూ కలర్ ప్యాంటు, చెక్స్ వున్న లైట్ బ్లూ కలర్ షర్టు వేసుకున్న వేణు మండపంలో వధూవరులని రకరకాల పోజులలో ఫొటోలు తీస్తుంటే చాలామంది కళ్ళు అతని పైనే వున్నాయి. అభిజ్ఞ అతన్ని చూసి ఏ బిజినెస్ ఎగ్జిక్యూటివో అనుకుంది. ఆమె తల్లికీ తండ్రికీ అతను బాగా నచ్చాడు కాబోలు అతన్ని గురించి ఆరా తీసారు.

వేణు తండ్రి కూడా వ్యవసాయదారుడే. ఆయనకి యాభై ఎకరాల స్వంత వ్యవసాయం వుంది. అభిజ్ఞకి వేణు తొలి చూపులోనే నచ్చాడు. నవ్వకుండానే నవ్వినట్టుండే పెదవులు గుండెలోతులలోకి తొంగి చూసే కళ్ళు ఉంగరాల జుట్టు.. అతన్ని చూడగానే ఆమె కన్నె మనసు పరవశించింది. తొలిచూపులోనే అతనిపై సదభిప్రాయమూ కలిగింది.

వైజాగ్‌లో ఒక కార్పొరేట్ కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్‌గా వున్న ఆమె తండ్రి వాసుదేవ రావు ఆమె కోసం అప్పటికే పెళ్ళి సంబంధాలు వెతుకుతున్నాడు. పైరగాలి అంత స్వచ్ఛంగా, దేవాలయపు కోనేటిలో విరిసిన ఎర్రతామరంత నిర్మలంగా వున్న వేణు ఆయనకి నచ్చాడు. అభిజ్ఞకి కూడా వేణు నచ్చాడని పసిగట్టింది ఆమె తల్లి.

భర్త తన దగ్గర వేణు ప్రస్తావన తేగానే ముఖం చిట్లించిందావిడ.

''సిటీలో పుట్టి పెరిగిన పిల్లకి ఆ పల్లెటూరి సంబంధం చేస్తానంటారేమిటండీ?''

''ఇవాళ రేపు పల్లెటూరు పల్లెటూరులా వుంటోందేమిటి? అన్ని చోట్లా టీవీ, ఫ్రిజ్, ఫోన్ సదుపాయం వుంది.''

''కానీ కరెంటే వుండదు. రోజుకి ఏడు నుంచి ఎనిమిది గంటలు పవర్ కట్''


''హాయిగా డాబా మీద మంచం వేసుకుని పడుకుంటే కరెంటుతో పనేం వుంటుందోయ్. ఆ స్వచ్ఛమైన గాలి, కమ్మని పాలు, చెట్టు నుంచి కోసిన వెంటనే వండుకోడానికి వీలుగా లేత కూరలు...నాకైతే ఈ వాహనాల రొద, కాలుష్యానికి దూరంగా ఏ పల్లెటూరికో వెళ్ళి సుఖంగా చేల గట్లంట నడుస్తూ ఆకాశంలో బారులు తీరి ఎగిరే పక్షులని, కడుపునిండా గడ్డిమేసి చెంగుచెంగున గంతులు వేసే దూడలని చూస్తూండిపోవాలనిపిస్తోంది'' అన్నాడు వాసుదేవ రావు.

''ఇంకేం? మీ అమ్మాయికి ఆ పల్లెటూరి సంబంధం చేసి కూతురితోబాటు దాని అత్తవారింటికి అరణం వెళ్ళండి'' ఎత్తి పొడుపుగా అంది.

ఊహల నిండా కలల నిండా వేణుని నింపుకున్న అభిజ్ఞ అతని కోసం పల్లెటూరిలోనే కాదు, అడవిలో వుండడానికైనా సిద్ధం అన్నట్టు వుంది. తండ్రి పల్లెటూరికి వెళ్ళి వేణు వాళ్ళ ఇంటిని చూసి ఆధునిక సౌకర్యాలన్నీ వున్న ఆ ఇంటిని తెగ వర్ణించాక ఆవిడ మనసు కూడా కుదుటపడింది. అలా అభిజ్ఞ వేణుల పెళ్ళి నిశ్చయమయింది.

## మెరుపులతార

**మేఘమై వచ్చి, ఉరుములా ఉరిమి, మెరుపులా మెరిసి మాయమైపోయే సినీతారలు యువతరం గుండెల్లో తుపానుని రేపుతారు. అందాల తార ప్రియాంకాచోప్రా మళ్లీ మెరుపులు మెరిపించడానికి సిద్ధమైంది. విపుల్ అమృత్‌లాల్ షా దర్శకత్వంలో బ్లాక్ బస్టర్ మూవీ ఎంటర్‌టైనర్స్ నిర్మిస్తున్న 'వక్త్-ది రేస్ అగైనెస్ట్' చిత్రంలో ప్రియాంకాచోప్రా ఓ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రంలో ప్రియాంకాచోప్రాతో పాటూ అమితాబ్‌బచ్చన్, అక్షయ్‌కుమార్ తదితరులు నటిస్తున్నారు.**



''పల్లెటూరిబావని చేసుకుంటున్నావన్న మాట'' నవ్వింది వైష్ణవి, అభిజ్ఞ స్నేహితురాలు.

''నీ మొగుడు నిన్ను ఎడ్లబండి ఎక్కిస్తాడేమోనే!''

''అతనికి మోటార్ సైకిల్ వుంది'' ఉక్రోషంగా అంది అభిజ్ఞ.

''పొలంలోనైనా బండి తోలక తప్పదుగా?'' మరింత ఉడికించింది.

''అతని దగ్గర పన్నెండుమంది జీతగాళ్ళున్నారు. బండి తోలవలసిన ఖర్మ అతనికేమిటి''

''ఇంతకీ నీ హీరో పంచె కట్టుకుంటాడా ప్యాంటు ధరిస్తాడా''

''వేణుని చూస్తే కుళ్ళిపోతావ్! అంత స్మార్ట్ అండ్ హేండ్‌సమ్‌గైని నేనింతవరకు చూడలేదు తెలుసా?''

''అందుకేగా మనసు పారేసుకున్నావ్? నిజం చెప్పవే. ఆ పల్లెటూళ్ళో వుండగలవా?''

''రాముడున్న చోటే సీతకి అయోధ్య. వేణుకోసం పల్లెటూరిలో కాదు, అడవిలో వుండమన్నా నేను సిద్ధమే. నీ సంగతేమిటి? నీ హీరో వివరాలు చెప్పు''

''అతని పేరు కిషోర్. బెంగుళూర్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్. మరీ అంత అందగాడు కాడు కానీ ఫర్వాలేదు. బాగానే వుంటాడు''

''ఇంతకీ పెళ్ళెప్పుడు?''

''వచ్చే నెల 12న''

''నా పెళ్ళి 18న'' అంది అభిజ్ఞ.

''నీ పెళ్ళికి నేను రాను. మేము హనీమూన్‌లో వుంటాం''

''నా పెళ్ళికి నువ్వు రాకపోతే నీ శోభనమే జరగకుండా చేస్తానే మిత్రద్రోహి!''

''సరదాగా అన్నానే బాబూ! నీ పెళ్ళికి రాకుండా ఎలా వుంటాను? మా ఆయనతో సహా వస్తాను. నీ పెళ్ళయ్యాకే మేం హనీమూన్‌కి వెళ్తాం''

ఇద్దరూ నవ్వుకున్నారు.

గతంలో నుంచి తేరుకుని వర్తమానానికి వచ్చింది అభిజ్ఞ. తనకి మాట ఇచ్చినట్టుగా వైష్ణవి తన పెళ్ళికి రానేలేదు. వాళ్ళ పెళ్ళయిన మూడవ రోజునే హనీమూన్‌కి వెళ్ళారని వింది. తను మాత్రం ఏ సరదా

లేకుండా ఈ పల్లెటూళ్ళో... అభిజ్ఞకి ఉక్రోషంగా వుంది.

★ ★ ★

ఆ రాత్రి డాబా మీద పరుపులు వేయించాడు వేణు. ఇవాళ మరింత హుషారుగా వున్నాడు.

అభిజ్ఞ భోజనం కెలికి వదిలేసింది.

''నువ్వేమీ తినలేదు. ఒంట్లో బాగా లేదా? ఆకలి లేదా?''

''తలనెప్పి'' అబద్ధం చెప్పింది.

''అరెరె! మాత్ర తెప్పిస్తానుండు''

''వద్దు. అదే తగ్గుతుంది''

''సరే! నువ్వు రెస్టు తీసుకో! ఇవన్నీ నేను సర్దేస్తాను'' అన్నాడు వేణు. అతను గిన్నెలు సర్దుతుంటే ఆమె దర్జాగా డాబా ఎక్కి పడుకుంది.

వేణు మెట్లెక్కి పైకి రావడం చూసి కళ్ళు మూసుకుంది.

అతనామె పక్కలో కూర్చుని జండూబామ్‌ని మృదువుగా ఆమె కణతలకి రాయడం మొదలుపెట్టాడు.

'తనంటే ప్రాణం పెడతాడు. అది పెళ్ళయిన తొలి దినాలలో భార్యాభర్తల మధ్య వుండే ఆకర్షణ అనిపించదు.

'నీ కోసం నేను ఏమైనా చేస్తాను' అన్నంత గాఢత, స్వచ్ఛత వున్నాయా ప్రేమలో. కాని, తన మనసులోని కోరికనెందుకు తెలుసుకోడు ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకుంది.

కాని, రాత్రంతా వేణు మెళకువగా వున్నాడని, తనకి జ్వరం వచ్చిందేమోనని ఆందోళనతో చీటికీ మాటికీ తన నుదురు తాకి చూస్తున్నాడని ఆమెకి తెలియదు.

★ ★ ★

మరునాటి రాత్రి భోజనం కాగానే సాయంకాలం పనిమనిషి చేత రుబ్బించి వుంచిన గోరింటాకుని పెట్టుకుంది. ఎడమ చేతికి కుడిచేత్తో పెట్టుకుంది కాని, కుడిచేతికి వేణు సాయం తీసుకోక తప్పలేదు.

''ఇప్పుడు గోరింటాకు ప్రోగ్రామ్ పెట్టావేమిటోయ్'' ఆమె అరిచేతిలో గోరింట ముద్దని అందమైన చంద్రుడిలా దిద్దుతూ అడిగేడు.

''పొద్దుటకి ఎర్రగా పండుతుందని''

''అది కాదు అభిజ్ఞా...ఇప్పుడు పెట్టుకుంటే నీ బట్టలే కాదు నా బట్టలు కూడా పాడవుతాయి కదా?''

''ఏమీ పాడవవు. నేను కదలకుండా పడుకుంటాను.''

''నువ్వు సరే. నేను.. నా సంగతేమిటి?''

''మీరు కూడా కదలకుండా పడుకోండి'' వస్తున్న నవ్వుని బిగపట్టి అంది.

వేణు సీరియస్‌గా చంద్రుని చుట్టూ కోట పెట్టడంలో నిమగ్నుడయ్యాడు.

''గుడ్! నాకంటే మీరే మంచి డిజైన్ వేసారు'' పూర్తయిన గోరింట డిజైన్‌ని చూస్తూ మెచ్చుకోలుగా అంది.

''థాంక్ యూ!'' అన్నాడు వేణు స్పోర్టివ్‌గానే.

దూరంగా పడుకున్న తననే చూస్తూ, నిద్రరాక అవస్థపడుతున్న వేణుని చూసి 'పాపం! మరీ ఎక్కువ ఏడిపిస్తున్నానేమో?' అనుకుంది.

మరుక్షణం 'తన కోరిక తీర్చేవరకూ అతనికా శిక్ష తప్పదు' అనుకుంది.

★ ★ ★

మరునాడు..వేణు పొలం నుంచి వచ్చేటప్పటికి అభిజ్ఞ కిచెన్‌లో బిజీగా వుంది. సగం కట్టి వదిలేసిన మల్లెపూల మాల డైనింగ్ టేబిల్ మీద వుండడం చూసి అడిగాడతను.

''అదేం? పూలు కట్టడం? సగంలో వదిలేసావేం?''

''పెట్టుకోకూడదు''

''అదేం?''

మూడు వేళ్ళు చూపించింది.

''ఓ'' నిరుత్సాహంగా చూసాడు.

ఒక చిన్న అబద్ధంతో అతన్ని నమ్మించినందుకు అభిజ్ఞ తనలో తనే నవ్వుకుంది.

★ ★ ★

నాలుగు రోజుల తరువాత...చీకటిపడ్డాక పొలం నుంచి వచ్చిన వేణు ''అభిజ్ఞా! కొంచెం మంచినీళ్ళు పట్రా!'' అని పిలిచాడు.

''వస్తున్నాను..'' లోపల నుండి వినవచ్చిన ఆ స్వరం అభిజ్ఞది కాదు.

అమ్మది.

మంచినీళ్ళు తెచ్చిన తల్లిని చూసి సంభ్రమాశ్చర్యాలు ముప్పిరిగొనగా అడిగాడు.

''ఎప్పుడొచ్చావమ్మా? నాన్నగారు వచ్చారా?''

''మధ్యాహ్నం మూడు గంటలకి వచ్చాం. మీ నాన్నగారు శివుడు మామయ్య కొడుక్కి పెళ్ళివారు వచ్చారంటే వాళ్ళింటికి వెళ్ళారు''

''కొత్తగా పెళ్ళయిన వాళ్ళు. కొన్నాళ్ళు మీరి ద్దరే వుండండి'' అని తనెంత వారిస్తున్నా వినకుండా విజయవాడలో వుంటున్న అన్నగారి దగ్గరికి వెళ్ళిన తల్లీతండ్రీ ఇరవై రోజుల తరువాత రావడం ఆనందంగానే వుంది వేణుకి.

బట్టలు మార్చుకోడానికి గదిలోకి వెళ్ళిన అతను పాదానికి బేండేజ్‌తో మంచం మీద పడుకుని వున్న అభిజ్ఞని చూసి ఆందోళనగా అడిగాడు.

''అరె! కాలికేమయింది?''

''బాత్‌రూమ్‌లో కాలుజారి పడ్డాను బెణికింది.''

''ఆ బేండేజి నువ్వే వేసుకున్నావా? ప్రతీ దానికీ స్వంత వైద్యమేనా? సిటీకి వెళ్ళి ఎక్స్‌రే తీయిద్దాం పద. కర్మ కాలి ఫ్రాక్చరయితే..''

''ఫ్రాక్చర్ కాదు. నాకు తెలుసు''

ఆ దెబ్బేదో తనకే తగిలినట్టు హడావుడి చేస్తున్న భర్తని మురిపెంగా చూడబోయి అంతలోనే గాంభీర్యాన్ని అరువు తెచ్చుకుంది. హనీమూన్‌కి తీసుకెళ్ళలేదనే బాధ కోపంగా మారగా కాలునెప్పి వంకతో ఆ రాత్రి అతన్ని 'ఉపవాసం' వుంచింది.

★ ★ ★

మరునాడు పుట్టింటికి ప్రయాణమైన కోడలిని ఆశ్చర్యంగా అడిగింది కామాక్షమ్మ.

''అదేమిటమ్మా? ఇంత హఠాత్తుగా పుట్టింటికెళ్తున్నావ్?''

''రేపటి నుంచీ ఆషాఢమాసం మొదలవబోతోంది కదత్తయ్యా!''

''ఆషాఢమాసం అత్తగారు, కొత్తకోడలు ఒక గడప దాటకూడదనే శాస్త్రం తెలిసినదానివి నాకు ఫోన్ చేసి ఇక్కడకెందుకు రమ్మన్నావ్?''

''నేను పుట్టింటికి వెళ్ళడం కోసమే మిమ్మల్ని ఇక్కడకి రమ్మన్నానత్తయ్యా! అసలు ఆషాఢ మాసం అత్తగారు, కొత్తకోడలు ఒక ఇంట్లో వుండకూడదనే ఆచారం ఎందుకు పెట్టారో తెలుసా?

పూర్వకాలంలో వ్యవసాయమే ఆధారంగా జీవించేవారు. మూడు వంతులకి, పైగా రైతు కుటుంబాలే వుండేవి. సాధారణంగా పెళ్ళి ముహూర్తాలు వేసవికాలంలో వుంటాయి.

ఆషాఢమాసంలో వర్షాలు ప్రారంభమై ఆకుమడులు పోయడం, ఊడ్పుల సీజన్ మొదలవుతుంది. రైతులకి చేతినిండా పని వుంటుంది.

కొత్త పెళ్ళికొడుకు భార్య మోజులో పడి వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తాడని ఆ నెలంతా కొత్త పెళ్ళి కూతురిని పుట్టింటికి పంపేవారు. అది ఆచారం అంటే విధిగా



పాటిస్తారు కాబట్టే ఆచారమయింది.

నేను ఇక్కడ వుంటే మీ అబ్బాయికి వ్యవసాయం మీద దృష్టి వుండదు. అందుకే పుట్టింటికి ప్రయాణమవుతున్నాను''

కోడలు చెప్పింది విని ''ఎంతయినా చదువుకున్న పిల్ల. ఎంత చక్కగా చెప్పింది'' అనుకుంది కామాక్షమ్మ.

అభిజ్ఞని బస్సెక్కించి వచ్చిన కొడుకు ముఖంలోని, దిగులుని చూసి నవ్వుకున్న కామాక్షమ్మ కోడలు ఆషాఢమాసానికి ఇచ్చిన వివరణ చెప్పింద తనితో.

తల్లిని కావాలని ఇక్కడకి పిలిపించి తను పుట్టింటికి వెళ్ళడానికి కారణం అది కాదని వేణుకి అర్థమయింది.

అభిజ్ఞ కావాలనే వైజాగ్ వెళ్ళింది. ఆషాఢ మాసం అనేది కేవలం వంక అని గ్రహించలేని అమాయకుడు కాడతను. గత పదిరోజులుగా తనని దూరంగా వుంచుతున్నది తనపై అలకతో అని కూడా గ్రహించగలిగాడు.

★ ★ ★

వైష్ణవిని చూసి నిర్ఘాంతపోయింది అభిజ్ఞ.

లోతుకుపోయిన కళ్ళు పాకిపోయిన చెక్కిళ్ళతో జబ్బుపడి లేచిన దానిలా వున్న ఆమెని చూసి వేళాకోళంగా అడిగింది.

''నిన్ను మీ ఆయన నిజంగానే కొరుక్కుతింటున్నాడేమిటే! చిక్కి సగమయిపోయావు?''

వైష్ణవి ముఖం మ్లానమయింది. కూతురి వెనుకనే వచ్చి అభిజ్ఞని పలుకరిస్తున్న అరుంధతి ముఖం మామూలుగా లేదు.

''ఎలా జరిగింది మీ హనీమూన్..''

సమాధానంగా వైష్ణవి అభిజ్ఞని కౌగలించుకుని భోరుమంది. ఎంతో అనునయించిన మీదట బలవంతాన, దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ ఆమె చెప్పిన సంగతులు విని నిశ్చేష్ట అయింది.

కిషోర్ పరమ కోపిష్ఠి. భార్యని మానసికంగా శారీరకంగా హింసించి ఆమె బాధపడుతుంటే ఆనందించే శాడిస్ట్. తాగుబోతు కాదు కాని తాగుతాడు. తాగినప్పుడు అతని కోరికలు విపరీతంగావుంటాయి.

''నన్ను నిజంగానే కొరుక్కుతింటున్నాడే!'' వైష్ణవి చీర పైకి తొలగించి చూపించింది. తెల్లటి ఆమె తొడల మీద అతను శృంగారం పేరుతో చేసిన గాయాలు పచ్చి నెత్తురు ఓడుతున్నాయి.

పెళ్ళయ్యాక మూడు రోజులు బాగానే వున్నాడు. హనీమూన్‌లో అతని నిజస్వరూపం బయటపడింది. బోలెడు ఊళ్ళు తిప్పాడు. రకరకాల చీరలు, చెప్పులు, హేండ్ బ్యాగ్‌లు కొన్నాడు. కాని, రాత్రయితే అతనిలోని రాక్షసుడు నిద్రలేస్తాడు.

అభిజ్ఞకి దుఃఖమొచ్చింది.

''ఆ రాక్షసుడిని జీవితాంతం ఎలా భరిస్తావే?'' కన్నీళ్ళతో అడిగింది.

''అతన్ని మార్చడానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రయత్నంలో ఓడిపోతే విడాకులు తీసుకుంటాను''

అభిజ్ఞకి స్నేహితురాలిపై జాలితోబాటు తన మీద తనకి అసహ్యం కలిగింది. హనీమూన్‌కి తీసుకెళ్ళలేదని వేణుని ఎన్ని రకాలుగా బాధ పెట్టింది? ఆమె కళ్ళలో నీళ్ళూరుతున్నాయి.

''నీ పెళ్ళికి రానివ్వకుండా నన్ను హనీమూన్‌కి లాక్కెళ్ళాడు. నేను ఎంత చెప్పినా వినలేదు'' కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది వైష్ణవి.

''నువ్వు సుఖంగా వున్నావా అభిజ్ఞా? మీ ఆయన మంచివారేనా?''

''ఆయన దేవుడు వైష్ణవీ!'' అంది అభిజ్ఞ. ఆమె గుండెలోతులలో నుంచి వచ్చాయా మాటలు.

★ ★ ★

గడప అవతల సూట్‌కేసుతో నిలబడి వున్న అభిజ్ఞని చూసి నివ్వెరపోయింది కామాక్షమ్మ.

''అదేమిటమ్మా. అక్కడే నిలబడి పోయావు. లోపలకి రా!''

''ఆషాఢమాసం..'' నసిగింది.

''ఆషాఢమాసంలో ఒక ఇంట్లో వుండకూడనిది కొత్తగా పెళ్ళయిన జంట అని, అత్తగారు కొత్త కోడలు కాదని నువ్వే చెప్పావుగా? అయినా నాకలాంటి మూఢనమ్మకాలేం లేవు. లోపలికిరా!''

అభిజ్ఞ లోపలికి వస్తూనే అత్తగారికి, మామగారికి పాదాభివందనం చేసింది.

ఆమెలో సుస్పష్టంగా కనిపిస్తున్న అలజడిని గమనించిన కామాక్షమ్మకి కొడుక్కి కోడలికి మధ్య ఏదో చిలిపి తగాదా వచ్చి వుంటుందని, అందుకే ఆమె ఆషాఢం వంకతో పుట్టింటికి వెళ్ళిందని అర్థమయింది.




పొలంలో ఆకుమడిలో కలుపుతీయించి, మరునాటి పనికి కూలీలను పురమాయించి, వేణు చీకటి పడుతుండగా ఇంటికి వచ్చాడు.

గదిలోకి వెళ్ళేసరికి అభిజ్ఞ అచ్చం తొలిరాత్రిలాగే తలదించుకుని గది మధ్యగా నిలబడి వుంది. ఆమె చెంపలు మధురోహలతో కెంపులయి అరచేతులకి వున్న గోరింట ఎరుపుతో పోటీ పడుతున్నాయి. గులాబీ రంగు ప్రింటువున్న తెల్లని కాటన్ చీరతో తలలో సన్నజాజులతో ముగ్ధమనోహరంగా వుంది.

అతని అడుగుల శబ్దం విని, తల ఎత్తింది. వేణు చిలిపిగా నవ్వుతూ అడిగాడు.

''నువ్వు అప్పుడే అత్తారింటికి వచ్చేసావేమిటి? ఇది ఆషాఢమోసం కదా?'' అన్నాడు.

అతను కావాలనే 'మా'ని 'మో'గా మార్చి పలుకుతున్నాడని అర్థమయింది అభిజ్ఞకి. తల ఎత్తి అతన్ని సూటిగా చూడలేక నేల చూపులు చూస్తూ ''నన్ను క్షమించండి'' అంది.

''దేనికి?'' విస్మయంగా అడిగాడు.

అభిజ్ఞ మొత్తం చెప్పేసింది.

''హనీమూన్‌కి తీసుకెళ్ళలేదని ఇంత పనిష్మెంట్ ఇస్తావా రాక్షసీ!'' మెత్తగా ఆమె చెంపపై కొట్టాడు.

''మరి నా శిక్షా కాలం శ్రావణమాసం వచ్చేవరకు పొడిగించవచ్చుగా?''

ఒక్కసారిగా బరస్టయింది. ఆమె కన్నీళ్ళు చూసి కంగారుపడిపోయాడు.

''ఏమిటిది, నేనేదో సరదాగా అంటే? చిన్నపిల్లలా?'' తన స్నేహితురాలు వైష్ణవికి వైవాహిక జీవితంలో ఎదురయిన అపశ్రుతి గురించి చెప్పింది.

''తేనెలాంటి మనసున్న మచ్చలేని చంద్రుడు మీరు.

మీరు నా పక్కనవుంటే నాకు ప్రతీక్షణం హనీమూనే'' ''అయినా నేను నిన్ను హనీమూన్‌కి తీసుకెళ్ళనని ఎందుకనుకున్నావ్?

ఆషాఢమాసమని మా అమ్మ చాదస్తంగా నిన్ను మీ వాళ్ళింటికి పంపించేస్తుందేమో, హాయిగా ఈ నెల రోజులూ మనం హనీమూన్‌కి చెక్కెయ్యచ్చు అని టిక్కెట్లు కొన్నాను. రేపే మనం హనీమూన్‌కి వెళ్తున్నాం''

అభిజ్ఞ ఇంక అతని ఎడబాటుని సహించలేనట్టు అతని గుండెలపై వాలిపోయింది. 'మంచి మనసున్న భర్త దొరికిన ఆడదానికి అతని సాహచర్యంలో జీవితమంతా హనీమూనే' అనుకుంటున్న ఆమె మనసు, వేణుపై అనురాగంతో ఉప్పొంగింది.

☆